కడప-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గురువారం 01 జనవరి 2026

## అయ్యప్ప ఆలయంలో మకర విళక్కు పూజలు

రాజంపేట, డిసెంబర్ 31 ప్రభాతవార్త



మండల పూజలు పూర్తయిన తర్వాత మకర విళక్కు కోసం శబరిమలలో బుధవారం ఆలయం తెరిచిన నేపథ్యంలో రాజంపేట లో కూడా అయ్యప్ప ఆలయంలో తెల్లవారుజామునే ప్రత్యేక పూజలు చేసి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. గుడిని నాలుగు రోజుల మూసిన అనంతరంఆలయ గురుస్వామి కొండా సత్యనారాయణ, పురోహితుడు రాఘవేంద్ర శర్మ, దాము స్వామీలు స్వామికి ప్రత్యేక అభిషేకాలను చేశారు. పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అష్టోత్తర శతనామావళి పూర్తి చేసి స్వామిని చందన అలంకారంలో తీర్చిదిద్దారు. శబరిమలలో మకర విళక్కు పూజల కోసం మొదటి రోజు కలభాభిషేకం చేయడం ఆనవాయితీ. సన్నిధానంలో జరిగే ప్రధాన పూజలలో కలభాభిషేకం ఒకటి. మధ్యాహ్న పూజకు ముందు ఉదయం 11 గంటలకు కలభాభిషేకం జరిగింది. తంత్రి మహేష్ మోహనార్ పర్యవేక్షణలో, కలభాభిషేకం కోసం సిద్ధం చేసిన కలభకుంభంతో పూజలు చేసిన అనంతరం, ప్రధాన అర్చకుడు ఇ.డి. ప్రసాద్ మంగళవాయిద్యాల నడుమ శ్రీకోవిల్ చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. ఆ తర్వాత కలభాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి ఎస్. శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి ఓ.జి. బిజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సౌమ్యనాథ స్వామి సన్నిధిలో జిల్లా కలెక్టర్

నందలూరు ,డిసెంబర్ 31 ప్రభాతవార్త :

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామిని కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ బుధవారం దర్శించుకున్నారు. ఆయనను ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతించి, ప్రత్యేక పూజలు నిర్వహింపజేసి, ఆలయ చరిత్రను వివరించారు. అనంతరం తీర్థ,ప్రసాదాలు అందజేసి సత్కరించారు. ఆయన వెంట రాజంపేట సబ్ కలెక్టర్ భావన, తాసిల్దార్ అమరేశ్వరి, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.





రాయచోటి జిల్లా కేంద్రం మదనపల్లెకు తరలిపోవడంతో వైసిపి నిరసన ర్యాలీ



మదనపల్లె జిల్లా సందర్భంగా విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

## ఎన్టీఆర్ సామాజిక పింఛన్లతో భరోసా

### జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

మదనపల్లి (పుంగనూరు) డిసెంబర్ 31: ప్రభాతవార్త

పుంగనూరు లోని తూర్పు మగుసాల లోని టిటిడి కళ్యాణమండపం రోడ్డు నందు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో బయోమెట్రిక్ ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దనే వేలిముద్ర తీసుకుని నగదును లబ్ధిదారులకు ఇచ్చే కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు. వితంతు పింఛన్, వృద్ధాప్య పింఛన్ల పంపిణీ స్వయంగా పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇంటి వద్దనే పెన్షన్ అందుతుందా, ఏ రోజు పింఛను అందుతోంది, ఎన్ని గంటల సమయంలో అందుతుంది, గతంలో ఎంత వస్తుండేది? ఇప్పుడు ఏంత వస్తున్నది వంటి ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

# కొత్త సంవత్సరంలో ప్రజలకు మోదం... ఖేదం

రాజంపేట, డిసెంబర్ 31 ప్రభాతవార్త

వైకాపా హయాంలో జరిగిన ఒక తప్పు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రజలకు శాపంగా మారింది. పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రమే జిల్లా కేంద్రం ప్రాతిపదికగా రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాలు ఏర్పాటు అయితే రాజంపేటలో మాత్రం సెంటర్ పేరుతో నయవంచన చేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం కూడా సర్దుబాటు పేరుతో, ప్రజాభిప్రాయం పేరుతో మూడు ముక్కలు చేసి, పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఓటర్లను కూడా మూడు జిల్లాల పరిధిలో చేరేలా చేసింది. నూతన సంవత్సరానికి రెండు రోజులు ముందు జరిగిన ఈ పరిణామం ప్రజల్లో సంతోషం కంటే విమర్శలే అధికంగా వినిపిస్తున్నాయి. ఇదే మంచి ప్రత్యామ్నాయమని కూటమి ప్రభుత్వం భావిస్తున్నా ప్రజల్లో ఆ విధంగా లేదు. శతాబ్దం పాటు ఒక జిల్లా పరిధిలో నివసించిన ప్రజలు, నాలుగేళ్ల పాటు మరొక జిల్లా పరిధిలో కొనసాగిన ప్రజలు, నేడు పూర్తిగా మారనున్న నేపథ్యం వారిని బాధిస్తోంది. అటు రాయచోటి, ఇటు రైల్వే కోడూరు నియోజవర్గాల ప్రజలు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోకి చేరారు. రాయచోటి ప్రజలు పూర్తిగా విభేదిస్తుండగా రైల్వే కోడూరు నియోజవర్గంలోని చిట్వేలి ,పెనగలూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట మండలాలకు చెందిన ప్రజలు తిరుపతి జిల్లాలోకి విలీనం చేయడం స్వాగతించడం లేదు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కొత్త జిల్లాల సమీకరణలు ఏ మేరకు ప్రభుత్వానికి అనుకూలంగా మారుతాయా, ప్రతికూలంగా మారుతాయా వేచి చూడాల్సి ఉంది. సొంత ఊరిని కోల్పోయినట్లు ఎక్కువ మండలాల ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. కడప జిల్లాలో గతంలో వారికి ఉన్న బంధం అలాంటిది. అధికారంలో ఉన్న ప్రజా ప్రతినిధులకు ప్రత్యామ్నాయం పేరుతో వారిని బుజ్జగించి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా ప్రజల్లో మాత్రం మిశ్రమ స్పందన కనిపిస్తోంది. జగన్ సర్కార్ రాజంపేట జిల్లా కేంద్రం చేయకుండా రాయచోటి చేయడం అటు ఆ ప్రాంత ప్రజలకు,ఇటు రాజంపేట ప్రాంత ప్రజలకు శాపంగా మారింది. అన్ని అర్హతలు ఉండి రాజంపేటకు తీవ్ర అన్యాయం జరగగా, రాయచోటికి జిల్లా కేంద్రం మూన్నాళ్ళ ముచ్చటే అయింది. ఏది ఏమైనా ఏ పాలకపక్షమైనా తమ బలాబలాలు, రాజకీయ ఆధిపత్యం, ఓట్ల వేటలో ఎక్కడ ఏది అనుకూలమో అందుకు అనుగుణంగానే నిర్ణయం తీసుకున్నట్లు ప్రజల్లో ప్రచారం జరుగుతోంది. ఫలితంగా కొత్త ప్రాంతాలతో బంధం ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ముఖ్యంగా రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఓటర్లు అన్నమయ్య, కడప, తిరుపతి జిల్లాల పరిధిలోకి చేరిపోయారు. ఈ మార్పు రానున్న రోజుల్లో నియోజకవర్గాల పునర్ విభజన సమయంలో ఎక్కడికి దారి తీస్తుందో అనే ఆందోళన మేధావి వర్గంలో లేకపోలేదు. రాజంపేట రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉంటుందా, భవిష్యత్తులో రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం కేంద్రం గా కూడా ఉంటుందా అన్న అనుమానాలు కూడా ప్రజలను వేధిస్తున్నాయి. వీటికి ప్రస్తుత పాలకపక్షం నేతలు గ్యారెంటీ ఇవ్వగలరా అని కూడా ప్రశ్నిస్తున్నారు. ఎందుకంటే విభజన ప్రజలను కలచి వేసేలా జరిగింది. రాష్ట్రమంతా కూటమి హవా జరిగితే రాజంపేటలో వైసీపీ హవా ఎలా జరిగిందని చంద్రబాబు అన్నారో రానున్న రోజుల్లో ప్రస్తుత విభజన దేనికి దారితీస్తుందో వేచి చూడాల్సి ఉంది.





మదనపల్లిలో కొలువుదీరిన మొదటి కలెక్టర్ నిశాంత్ కుమార్



రాజంపేట సమీక్షలో పాల్గొన్న కడప కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

## పీలేరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని ప్రారంభించడం

## అదృష్టంగా భావిస్తున్నా: ఆర్డిఓ శ్రీనివాస్

పీలేరు డిసెంబర్ 31 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వం నూతనంగా కొత్త జిల్లాలలో భాగంగా మదనపల్లి ను అన్నమయ్య జిల్లాగా ప్రకటించి రాయచోటి నుండి మదనపల్లికి కలెక్టర్ కార్యాలయాన్ని తరలించడమే కాకుండా నూతనంగా పీలేరు పట్టణంలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని మంజూరు చేసి ప్రారంభోత్సవానికి రాయచోటి ఆర్డీవోను ఆహ్వానించడం అదృష్టంగా భావిస్తున్నానని రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి పీలేరు డివిజనల్ ఇన్చార్జికే శ్రీనివాసన్ తెలిపారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలోని కలికిరి, కలకడ గుర్రంకొండ, వాయల్పాడు, కె.వి పల్లి, పీలేరు తోపాటు పుంగనూరు ,సోమల మండలాన్ని పీలేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తేవడమే కాకుండా పరిపాలన సౌలభ్యంగా ఉంటుందని మదనపల్లి రోడ్డు లోని సంజీవ గాంధీ డిగ్రీ కళాశాల సమీపంలో విశాలమైన ప్రాంతంలో డివిజనల్ కార్యాలయాన్ని ప్రారంభించడం ప్రజలకు అన్ని విధాల అనుకూలంగా ఉంటుందన్నారు. పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి చొరవతో పీలేరు డివిజనల్ కేంద్రంగా మంజూరు చేసి ప్రజలకు మరింత సేవలు అందించేందుకు భాగ్యము కల్పించడం హర్షించదగ్గ విషయమని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డివిజనల్ కార్యాలయాన్ని ప్రారంభించామని దీనిని చుట్టుపక్కల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీలేరు మండల రెవెన్యూ అధికారి శివకుమార్, డిప్యూటీ తహసిల్దార్ ప్రసాద్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మురుగయ్య వీఆర్ఏ అధ్యక్షుడు రత్నాకర్ తో పాటు పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్

# జిల్లా అన్నిరకాలుగా అభివృద్ధి చెందుతుంది : కలెక్టర్

మదనపల్లె, డిసెంబర్ 31 ప్రభాతవార్త :

ప్రజల ఆకాంక్ష మేరకు మదనపల్లె కేంద్రంగా ఏర్పాటైన అన్నమయ్య జిల్లా అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం నూతన అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని అధికారికంగా జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ప్రారంభించారు. ముందుగా జిల్లా కలెక్టర్ పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించి కలెక్టరేట్ ఆవరణంలో ఉన్న మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు స్వాగతం పలికారు. అనంతరం నూతన జిల్లాకలెక్టరేట్‌ను కలెక్టర్ పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కలెక్టరేట్ కార్యాలయం ముందు గేటుకు ఉన్న బోర్డును కలెక్టర్ సబ్‌కలెక్టర్‌తో కలసి పరిశీలించారు. అనంతరం పట్టణంలోని జిల్లా పరిపాలన విభాగాలకు సంబంధించిన పలు కార్యాలయాలను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట డిఎస్పి మహేంద్ర, వివిధ జిల్లాశాఖ అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న సబ్‌కలెక్టర్..



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

## మదనపల్లె జిల్లా కేంద్రంపై హోరెత్తిన ర్యాలీ

### నెరవేరిన ప్రజల ఆకాంక్ష : ఎమ్మెల్యేలు

మదనపల్లె, డిసెంబర్ 31 ప్రభాతవార్త :

మదనపల్లె జిల్లా కేంద్రంగా ఏర్పాటైన సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ హోరెత్తింది. ఈ ర్యాలీలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో కలసి పాల్గొన్నారు. పుంగనూరు రోడ్డులోని మిషన్‌కాంపౌండ్ నుంచి విజయోత్సవ ర్యాలీ పట్టణంలోని చిత్తూరుబస్టాండు, అవెన్యూరోడ్డు, బెంగుళూరు బస్టాండు, ఎన్‌టిఆర్ సర్కిల్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు, మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పాలన సాగిస్తుందని దశాబ్దాల కల మదనపల్లె జిల్లా నెరవేర్చడమే ఇందుకు నిదర్శనమన్నారు. మదనపల్లె, తంబళ్ళపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల ప్రజలకు పండగ రోజు అన్నారు. నూతన సంవత్సరంలో అడుగు పెడుతున్న వేల మదనపల్లెజిల్లా అభివృద్ధిపథంలో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్‌బ్యాంకు ఛైర్మెన్ నాదేళ్ళ విద్యాసాగర్, పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పఠాన్‌ఖాదర్‌ఖాన్, ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు నాగూర్‌వల్లి, విజయభారతి సేతు, ఆర్‌జె. వెంకటేష్, షంషీర్, ఛైర్మెన్ జంగాల శివరామ్ వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## అన్నమయ్య జిల్లా వద్దు-మదనపల్లె పేరే ముద్దు

### బిఎస్‌పి నాయకులు కలెక్టరేట్ వద్ద నిరసనలు

మదనపల్లె, డిసెంబర్ 31 ప్రభాతవార్త :

అన్నమయ్యజిల్లా వద్దు మదనపల్లె పేరే ముద్దు అంటూ బిఎస్‌పి నాయకులు రాష్ట్ర అద్యక్షుల బందెల గౌతం కుమార్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టారు. జిల్లా కేంద్రం ఏర్పాటుపై ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరుగుతున్న విజయోత్సవ ర్యాలీ కలెక్టరేట్ వద్దకు చేరుకొన్న సమయంలోనే బిఎస్‌పి నాయకులు నిరసన తెలపడం వల్ల కొద్దిసేపు అక్కడ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా బందెల గౌతం కుమార్ మాట్లాడుతూ మదనపల్లె కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయడం పట్ల తాము సంతృప్తిగా ఉన్నామని, అయితే మదనపల్లె ప్రజల అంక్షను ప్రభుత్వం గుర్తించి అన్నమయ్య జిల్లా స్థానంలో మదనపల్లె జిల్లాగా పేరు మార్చాలని డిమాండ్ చేశారు. మదనపల్లెకు దశాబ్దాలుగా ఘనమైన చరిత్ర ఉందని గుర్తుచేశారు. భావితరాలు ఆ చరిత్రను గుర్తించుకోవాలంటే జిల్లాకు మదనపల్లె పేరు పెట్టడం ఎంతో అవసరం అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అన్నమయ్య జిల్లా పేరు మార్చేవరకు తాము ఆందోళనలు విరమించబోమని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం స్పందించి మదనపల్లెకు జిల్లా పేరు పెట్టిందుకు చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. మదనపల్లె పేరుతోనే జిల్లా కేంద్రం కొనసాగించాలంటూ డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మురళి, బిఎస్‌పి నాయకులు బాలాజి, చంద్ర, మహేష్, శివికుమార్‌రెడ్డి, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బిఎస్పి నాయకులు

## ప్రైవేట్ మెడికల్ స్టోర్‌లో ప్రభుత్వ ఆసుపత్రి మందులు

మదనపల్లెక్రైమ్, డిసెంబర్ 31 ప్రభాతవార్త.

ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలోని మందులు ప్రైవేట్ మెడికల్ స్టోర్ లో ప్రత్యక్షం అయ్యాయి. బుధవారం రాత్రి జిల్లా ఆసుపత్రి అత్యవసర విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ సయ్యద్ హదీద్ ఈ విషయాన్ని గుర్తించి, రెడ్ హ్యాండెడ్‌గా మీడియాను తీసుకెళ్లి చూపించారు. అత్యవసర విభాగంలో రోగులకు అందించే మెట్రో జెల్ ఐవి ఫ్యూజన్ సెలైన్ ముందు ఆసుపత్రికి ఎదురుగా ఉన్న ఓ ప్రైవేట్ మెడికల్ స్టోర్లో ఉన్నట్లు రోగి ద్వారా తెలుసుకున్నారు. వెంటనే అందుబాటులో ఉన్న విలేకరులను వెంట తీసుకొని ప్రైవేట్ మెడికల్ స్టోర్‌కు వెళ్లారు. ప్రైవేటు ఆసుపత్రిలో విక్రయిస్తున్న పారాసెటమాల్ ఐవి ఫ్యూజన్ సెలైన్ మందు డబ్బాలో, జిల్లా ఆస్పత్రిలో వినియోగిస్తున్న మెట్రోజెల్ ఐ వి సెలైన్ మందు ఉంచి ప్రత్యక్షంగా చూపించారు. ఈ విషయం ప్రైవేట్ మెడికల్ స్టోర్ సిబ్బందిని విలేకరులు ప్రశ్నించగా, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులు మందు వెనక్కి తీసుకొచ్చి ఇస్తే తాము చూసుకోకుండా ఉంచుకున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని మందులు ఈ విధంగా ప్రైవేట్ మెడికల్ స్టోర్లో ఎలా ప్రత్యక్షమవుతున్నాయో అధికారుల సమాధానం చెప్పాల్సి ఉంది.

## ప్రభుత్వ నిధులను సక్రమంగా వినియోగించుకోవాలి

రాజుపాళెం, డిసెంబర్ 31, ప్రభాతవార్త:

ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను ప్రజల సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా ప్రజలపై ఉన్నదని ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వాసుదేవపురం గ్రామంలో మండల పరిషత్ నిధులతో నిర్మించిన త్రాగునీటి శుద్ధి కేంద్రంను బుధవారం ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం చేపట్టే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలు సక్రమంగా వినియోగించు కోవాలని తెలిపారు. గ్రామాలలో ప్రజల సౌకర్యార్థం అన్ని వసతులతో అభివృద్ధి జరుగుతున్నదని, పట్టణాలకు దీటుగా మెరుగైన జీవనమును, స్వచ్ఛమైన వాతావరణంతో జీవించవచ్చని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎవరికి నచ్చిన పార్టీకి వారు ఓట్లు వేసుకోవాలి, తర్వాత అందరూ కలిసిమెలిసి గ్రామాభివృద్ధికి భాగస్వామ్యం కావాలని కోరారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి గ్రామాల్లోని సమస్యలను తెలుసుకోవడంతో పాటు వారి వ్యక్తిగత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, హరివర్ధన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, తాసిల్దార్ మనోహర్ రెడ్డి, ఎంపీడీవో రామనాథరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవోలు శాకీర్ అలీ ఖాన్, ప్రతాప్, డి.ఈ మోహన్, నాగ భరత్ రెడ్డి, టిడిపి నాయకులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రాయచోటి జిల్లా కేంద్రం మార్పుపై అన్నమయ్య జిల్లా విచ్ఛిన్నం చేయడం రాజకీయ కుట్రలపై భగ్గుమన్న ప్రజలు.

రాయచోటి టౌన్ డిసెంబర్ 31 ప్రభాతవార్త

రాయచోటి జిల్లా కేంద్రాన్ని రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా రాయచోటి ప్రాంత ప్రజలు ఉవ్వెత్తున ఎగసిపడ్డారు. జిల్లా కేంద్రాన్ని కాపాడుకోవాలన్న సంకల్పంతో వేలాదిగా ప్రజలు రోడ్లపైకి వచ్చి, రాయచోటిని ఉద్యమ కేంద్రముగా మార్చేశారు. ప్రజాగర్జనతో పట్టణం మారుమోగింది. జిల్లా కేంద్ర తొలగింపు నిర్ణయాన్ని నిరసిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతియుత ర్యాలీ సంచలనం సృష్టించింది. రాయచోటి పట్టణం ఎస్.ఎన్. కాలనీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి చెక్‌పోస్ట్ శివాలయం, బంగ్లా వరకు సాగిన ఈ భారీ ర్యాలీలో జనసంద్రం వెల్లువెత్తింది. ఈ ఉద్యమానికి స్వచ్ఛందంగా ప్రజలు తరలిరావడం గమనార్హం. యువత, విద్యార్థులు, మేధావులు, విద్యావంతులు, వ్యాపారస్తులు, అన్ని వర్గాల ప్రజలు, వైఎస్ఆర్ సీపీ శ్రేణులు భుజాలు కలిపి జిల్లా కేంద్ర రద్దు నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. రాయచోటి జిల్లా కేంద్రం మా హక్కు దాన్ని లాక్కోనివ్వం" అంటూ నినాదాలతో పట్టణం దద్దరిల్లింది. ప్రభుత్వ నిర్ణయం ప్రజా ఆకాంక్షలకు విరుద్ధమని, వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నిరసనకారులు ఘాటుగా డిమాండ్ చేశారు. రాయచోటి జిల్లా కేంద్రాన్ని తొలగించాలన్న ప్రయత్నం ప్రజా వ్యతిరేక చర్యగా అభివర్ణిస్తూ, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ప్రజల సంకల్ప బలాన్ని తక్కువ అంచనా వేస్తే పరిణామాలు తప్పవని ప్రజాగర్జన స్పష్టంగా హెచ్చరించింది.

### నినాదాలతో దద్దరిల్లిన రాయచోటి

రాయచోటి ముద్దు...మదనపల్లె వద్దు, వెనుకబడిన ప్రాంతంగా జిల్లా కేంద్రంగా ఏర్పడినరాయచోటికి అన్యాయం చేయొద్దు, రాయచోటి జిల్లా మన హక్కు, జిల్లా కేంద్రంగా రాయచోటి రద్దు నిర్ణయం.. ప్రజలకు ద్రోహం,రాయచోటిని జిల్లా కేంద్రంగా తీసేస్తే ఊరుకోం.. ఊరుకోం!,కావాలి..కావాలి... జిల్లా కేంద్రంగా రాయచోటి కావాలి,చరిత్రలో లేని అన్యాయం.. రాయచోటి పై ప్రయోగం,క్యాబినెట్ నిర్ణయం మారాలి..జిల్లా కేంద్రంగా రాయచోటి నిలవాలి,చంద్రబాబు ఎన్నికల హామీని నెరవేర్చండి.. రాయచోటిని కొనసాగిస్తామన్న మాట నిలబెట్టుకోండి, రాయచోటి గొంతు నొక్కవద్దు..ప్రజల ఓపికను పరీక్షించొద్దు,ఈ నినాదాలతో కలిగిన ప్లే కార్డులను ర్యాలీలో ప్రజలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ హిందూపురం పరిశీలకులు రమేష్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైఎస్ఆర్ సిపి రాష్ట్ర కార్యదర్శి దేవనాథ రెడ్డి, ఎస్ ఈ సి సభ్యులు ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, అఖిల భారత పంచాయితీ పరిషత్ సేక్రటరీ చిదంబర్ రెడ్డి, పార్లమెంటరీ రాష్ట్ర కార్యదర్సులు గొర్ల ఉపేంద్రారెడ్డి, పోలు సుబారెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఎంపిపి మద్దిరేవుల సుధర్శన్ రెడ్డి, రామాపురం జెడ్ పి టి సి మాసన వెంకట రమణ,జిల్లా సాధన సమితి గౌరవాధ్యక్షుడు డా బయారెడ్డి, అధ్యక్షుడు నాగిరెడ్డి, సభ్యులు వి ఆర్ రెడ్డి, మండల కన్వీనర్లు మిట్టపల్లె యదుభూషన్ రెడ్డి (గాలివీడు), గోవర్ధన్ రెడ్డి (చిన్నమండెం), నవాజ్ (మున్సిపాలిటీ),ఉదయ్ కుమార్ రెడ్డి (సంబేపల్లె), గడికోట జనార్ధన్ రెడ్డి (రామాపురం), మాజీ ఎంపిపిలు అంపాబత్తిన రెడ్డెయ్య, మోటకట్ల బరుగు రెడ్డెన్న, రాయచోటి మున్సిపల్ వైస్ చైర్మన్‌లు దశరథ రామిరెడ్డి, ఫయాజుర్ రెహమాన్, రాష్ట్ర కార్యదర్శి బసిరెడ్డి సిద్దారెడ్డి, వైఎస్ఆర్ సిపి మైనారిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి బేపారి మహమ్మద్ ఖాన్, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ భాస్కర్, ట్రైకార్ మాజీ చైర్మన్ గుండా సురేంద్ర, సీనియర్ నాయకులు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఒకరోజు ముందే సామాజిక పింఛన్ల పంపిణీ

తొండూరు డిసెంబర్ 31 ప్రభాతవార్త :

మండలంలోని గ్రామాల పరిధిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీని బుధవారం ఉదయం ఏడు గంటల నుంచే ప్రారంభించారు. మండల పరిధిలోని గోటూరు గ్రామానికి చెందిన డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ అన్నారెడ్డి వెంకటలక్ష్మీ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. రేపు నూతన సంవత్సరం సెలవుదినం కావడంతో ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును సచివాలయం సిబ్బంది పంపిణీ చేశారు. డిసెంబర్ నెలలో రెండు సార్లు ఫించన్లు పంపిణీ చేయడం ఘనత సీఎం చంద్రబాబు నాయుడు కే దక్కించుకున్నారని ఆయన కొనియాడారు. పెన్షన్ దారులు ఒకరోజు ముందుగానే పెన్షన్ రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### మట్టి ఆరోగ్యంగా ఉన్నప్పుడే

## పంటలు మంచి దిగుబడి




లక్కిరెడ్డిపల్లి డిసెంబర్ 31 ప్రభాతవార్త

భూమిలో మట్టి ఆరోగ్యంగా ఉన్నప్పుడే పంటలు మంచి దిగుబడి ఇస్తాయని ఎల్ టి ఎల్ ల్యాబ్ వ్యవసాయ అధికారి ఆచారి పేర్కొన్నారు బుధవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో మట్టి నమూనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా 8,9,10, తరగతి విద్యార్థులకు మట్టిలోని సాంద్రత పంట మార్పులు వివరాలు గురించి వివరించారు మట్టి అనేది మన ఆహార భద్రతకు మూలాధారమని మట్టి ఆరోగ్యంగా ఉన్నప్పుడే పంటలు మంచి దిగుబడిన స్థాయి అన్నారు మట్టిలో ఉన్న ముఖ్య పోషకాలు నత్రజని భాస్వరం పటాస్ సూక్ష్మ పోషకాలు ఉంటే పంట కొడకా మంచి దిగుబడిని ఇస్తుందన్నారు మట్టి పరీక్ష సాయిల్ పేస్టు ద్వారా ఉన్న పోషకాలను గుర్తించవచ్చు అన్నారు ఆమ్లత తెలుసుకొని అవసరమైన ఎరువులు ఉపయోగించుకోవచ్చు అన్నారు దీని వల్ల ఎరువులు వృధా కాకుండా పంట దిగుబడి పెరుగుతుందన్నారు దీంతో రైతులకు ఖర్చు కూడా తగ్గుతుందన్నారు కాబట్టి రైతులు వేసవిలోనే భూసారాన్ని దీర్ఘకాలంగా మట్టి నమూనాలు సేకరించి పొలాలు సాగు చేయాలన్నారు మట్టి నమూనా నివేదిక ఆధారంగా ఎరువులు ఉపయోగించవచ్చున్నారు భవిష్యత్తులో మట్టి సంరక్షణకు దోహదపడేలా బాధ్యతాయుత పౌరులుగా మారాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్ మండల వ్యవసాయ అధికారి రాజకుమారి ఎస్ ఎల్ టి ల్యాబ్ ఏఈవో చాంద్ బాషా అంజనమ్మ కిరణ్ కుమారి విద్యార్థులు పాల్గొన్నారు

## వైసిపి నాయకుడు మృతి పార్టీకి తీరని లోటు

సంబేపల్లె డిసెంబర్ 31 ప్రభాతవార్త



మండలంలోని దుద్యాల గ్రామ వైఎస్ఆర్ సిపి నాయకుడు యర్రపురెడ్డి బసిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బసిరెడ్డి గుండెపోటుతో బుధవారం తెల్లవారుజామున తిరుపతిలో ఆకస్మికంగా మృతి చెందారు. దుద్యాల పొట్రెడ్డిగారిపల్లెలో ఉంచిన భౌతిక కాయాన్ని శ్రీకాంత్ రెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు. అతని మృతిపట్ల సంతాపం తెలిపి వారి కుటుంభ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి తోడుగా వుంటామన్నారు. వైఎస్ఆర్సిపి ఈఎన్సి సభ్యుడు ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, అఖిల భారత పంచాయతీ పరిషత్ సెక్రటరీ చిదంబర్ రెడ్డి, పార్లమెంటరీ రాష్ట్ర కార్యదర్శులు గొర్ల ఉపేంద్రా రెడ్డి, పోలు సుబ్బారెడ్డి, రాష్ట్ర మండల కన్వీనర్ ఉదయ్ కుమార్ రెడ్డి, రాయలసీమ విద్యాసంస్థల అధినేత ఆనంద రెడ్డి,ఆవుల మల్లికార్జున రెడ్డి, మండల జెసిఎస్ కన్వీనర్ వడ్డీ వెంకట రమణా రెడ్డి, వైస్ ఎంపిపి లు శ్రీధర్ రెడ్డి, మీసాల భాగ్యమ్మ ఆంజనేయులు, వసంత శ్రీనివాసులు రెడ్డి,వివి ప్రతాప్ రెడ్డి,వాసుదేవ రెడ్డి కసిరెడ్డి వెంకట నరసింహా రెడ్డి, సర్పంచ్ దండు నాగభూషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలకు వాటర్ ట్యాంకుల వితరణ..




సుండుపల్లి, డిసెంబర్ 31,ప్రభాతవార్త :

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిమ్మసముద్రం, మండల ప్రాథమిక పాఠశాల వెంగమ రాజు గారి పల్లి పాఠశాలలకు త్రాగునీటి అవసరాలకై మానవతా సంస్థ రెండు ట్యాంకులను అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మానవతా కన్వీనర్ కృష్ణంరాజు ,ఉమ్మడి కడప జిల్లా ఆర్థిక కార్యదర్శి హరికుమార్, సభ్యులు నాగయ్య మరియు పాఠశాల ఉపాధ్యాయులు వెంకటరమణ, డాక్టర్ బాబు, అశోక్ రాజుశేఖర్, కృష్ణ నాయక్, ఆంజనేయులు, ఆదినారాయణ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## 2నుంచి పాస్ పుస్తకాల గ్రామసభలు

దువ్వూరు, డిసెంబర్ 31, ప్రభాతవార్త:

మండల పరిధిలో జనవరి నెల 2వ తేదీ నుంచి పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ పై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మండల తహసిల్దార్ సంజీవరెడ్డి తెలిపారు. జనవరి 2, 3వ తేదీలలో గుడిపాడులో 1076, 5న తేదీన అన్నపుసాత్ర పల్లెలో 435 పాస్ పుస్తకాలు, 6న గొల్లపల్లిలో 369, 7న మనేరాం పల్లె, చల్లబసాయి పల్లె, రాజుపాలెం గ్రామాల్లో వరుసగా 211, 156, 129 పాస్ పుస్తకాలు, 8వ తేదీన నెలటూరులో 518, 9వ తేదీన రామచంద్రపురంలో 128 పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ వారం రోజుల్లో 3062 పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తారని తెలిపారు. రీ సర్వే పూర్తి అయిన గ్రామాలలోనే పంపిణీ కార్యక్రమం ఉంటుందని రైతుల గ్రామసభకు వచ్చి పాస్ పుస్తకాలు తీసుకువెళ్లాలని ఆయన కోరారు.

## మరుగుదొడ్లకు మరమ్మత్తులు.

చిట్వేలి, డిసెంబర్ 31, ప్రభాతవార్త:




చిట్వేలి గ్రామపంచాయతీలోని ప్రభుత్వ కార్యాలయ సముదాయానికి సమీపంలో ఉన్న మరుగుదొడ్లకు మరమ్మత్తులు చేయించి అవసరమైన వారికి అందుబాటులో ఉంచినట్లు గ్రామ ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం తాను మాట్లాడుతూ ముఖ్యంగా మహిళా ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి,15వ ఆర్థిక సంఘ నిధులతో పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేయించి ఉచితంగా అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఎలాంటి రుసుము చెల్లించనవసరం లేదని, ఉపయోగించినవారు శుభ్రతను తప్పక పాటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా చర్యల ఆంక్షలను కఠినతరం చేయాలి




కడప, డిసెంబర్ 31 ప్రభాతవార్త :

ప్రజల ప్రాణ భద్రత కోసం చేపడుతున్న రోడ్డు భద్రత చర్యల ఆంక్షలను మరింత కఠినతరం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబందిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని విసి హాలులో జిల్లా ఆర్అండ్బి శాఖ ఆధ్వర్యంలో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్, కమిటీ చైర్మన్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ హాజరయ్యారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోవడం జరుగుతోందన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్న రహదారులపై ఎన్ఫోర్స్మెంట్ చర్యలను కఠినతరం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధానంగా నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా నగరంలోని ప్రధాన రోడ్లపై యువత బైకు రైడింగ్ విన్యాసాలను చేసే అవకాశం ఉన్నందున అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి కేసులు ఫైల్ చేయాలన్నారు. జిల్లాలో ఎన్ఫోర్స్ మెంట్ చర్యలను మరింత కఠినతరం చేయాలన్నారు. ప్రజల ప్రాణ భద్రతే ధ్యేయంగా చర్యలు చేపట్టాలన్నారు. యువతకు వాహనాలను కొనిచ్చే తల్లిదండ్రులు కూడా పిల్లలకు బాధ్యతలను గుర్తు చేయాలని సూచించారు. పరిమిత వేగం, రోడ్లపై బాధ్యతగా డ్రైవింగ్ చేయాలని సూచిస్తూ రోడ్డు భద్రతా, ప్రమాదాలను అరికట్టడంలో తల్లిదండ్రులు కూడా సామాజిక బాధ్యతను స్వీకరించాలన్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారుల్లో ఎక్కడైతే అనధికారికంగా డివైడర్లను బ్రేక్ చేసి వాహన ప్రమాదాలకు అవకాశం కల్పిస్తున్న వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలన్నారు. జాతీయ రహదారుల్లో ఆవసరమైన చోట్ల మాత్రమే గీ టర్న్ స్పాట్ లను ఉంచాలని, అలాగే.. అనవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లను వెంటనే తొలగించాలని సంబందిత అధికారులను ఆదేశించారు. రియల్టర్లు, రాజకీయ ప్రమేయాలకు స్పందించకుండా రోడ్డు భద్రతా ఆంక్షలను కఠినతరం చేయాలన్నారు. ఎన్ఫోర్స్ మెంట్ నిరక్ష్యం వల్ల ఎక్కడయినా ప్రమాదాలు సంభవిస్తే సహించేదిలేదని సంబందిత ఇంజనీరింగ్, ఎన్ఫోర్స్ మెంట్ అధికారులపై కూడా చర్యలు తప్పవన్నారు. ఇంజనీరింగ్ శాఖల వారీగా వారి సంభందిత రహదారులపై తాజాగా జరిగిన ప్రమాదాలను విశ్లేషించి, వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయాల్లో 108 వాహన సేవలు సకాలంలో అందేలా సంబందిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా విద్యా సంస్థల వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు, అలాగే ప్రతి పెట్రోల్ బ్యాంకులు, కమర్షియల్ కాంప్లెక్స్ ల వద్ద సిసి కెమెరా లను ఏర్పాటు చర్యలు తీసుకోవాలన్నారు. మలుపుల వద్ద బ్యారికెడ్, స్టాపర్స్, ప్రమాద సంకేత సూచికలను పొందుపరచాలన్నారు. బ్లాక్ స్పాట్స్ ను గుర్తించడం, లాంగ్ డ్రైవ్ లో వచ్చే డ్రైవర్ల సౌకర్యార్థం అక్కడక్కడా రెస్ట్ ఏరియాలు, రెస్టారెంట్లు ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులను ఆదేశించారు. ఏపీఎస్ ఆర్టీసీ, అన్ని ప్రయివేట్ బస్సులు, స్కూల్ బస్సులు ఖచ్చితంగా ఇన్ సైడ్, ఔట్ సైడ్ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు.అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, పరిమితికి మించి ఆటోలు నడపడం, బస్సులు ఇతర వాహనాలలో అధిక లోడుతో సరుకు, ఇతర సామగ్రి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవలసిందిగా రవాణ శాఖ అధికారులను ఆదేశించారు. ట్రాన్స్ పోర్ట్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో అంతర్ జిల్లా సరిహద్దుల చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో కమర్షియల్, అధిక జన సంచార ప్రాంతాల్లో రోడ్డు భద్రతా చర్యల్లో ఆయా మున్సిపల్ కమిషనర్లు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రజల ప్రాణ భద్రత కోసం రూల్స్ అతిక్రమించే వారిపై ఫైన్లు, కేసులు నమోదు చేయాలన్నారు. అన్ని విద్యా సంస్థల్లో రహదారుల భద్రతకు అవసరమైన నియంత్రణ చర్యలు, అత్యవసర సహాయక చర్యలు, నియమ నిబంధనలు మొదలైన వాటిపై అవగాహన కల్పించాలన్నారు. సినిమా థియేటర్లలో లఘు చిత్రాల ద్వారా అవగాహన పెంచాలన్నారు.ఈ కార్యక్రమంలో రాజంపేట ఏఎస్పీ మనోజ్ హెగ్డే, కమిటీ మెంబర్ కన్వీనర్ ఆర్ అండ్ బి ఎస్.ఈ. భాస్కర్ రెడ్డి, డిటీసీ వీరరాజు, మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, కమిటీ సభ్యులైన రోడ్ సేఫ్టీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు జి.వి రమణ, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్ అండ్ బి శాఖ అధికారులు, విద్యుత్ శాఖల ఎస్.ఈ.లు, మున్సిపల్ కమిషనర్లు, నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులు, ట్రాఫిక్, పోలీసు, రవాణా శాఖ అధికారులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# అత్యధిక మండలాలు కలిగిన జిల్లాగా వైయస్సార్ కడప జిల్లా

### రాజంపేట నియోజకవర్గం లోని రాజంపేట, నందలూరు, వీరబల్లె, సుండుపల్లె నాలుగు మండలాలు జిల్లాలో విలీనం..





కడప, డిసెంబర్ 31 ప్రభాతవార్త :

జిల్లాలో రాజంపేట నియోజకవర్గం కలవడంతో అత్యధిక మండలాలు కలిగిన జిల్లాగా వైయస్సార్ కడప జిల్లా నిలిచిందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, రాజంపేట ఏఎస్పీ మనోహర్ కుమార్ హెగ్డే లతో కలిసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్విభజనలో భాగంగా అన్నమయ్య జిల్లాలోని రాజంపేట నియోజకవర్గం లోని 4 మండలాలు రాజంపేట, నందలూరు, వీరబల్లె, సుండుపల్లె జిల్లాలో విలీనమైనట్లు తెలిపారు. ప్రస్తుతం 40 మండలాల తో రాష్ట్రంలోనే అత్యధిక మండలాలు గల జిల్లాగా నిలిచిందని అన్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిందని తెలిపారు. దీంతో రాజంపేట రెవెన్యూ డివిజన్ వైయస్సార్ జిల్లా పరిధిలో పనిచేస్తుందన్నారు.ఒంటిమిట్ట సిద్ధపటం మండలాలు కడప జిల్లా లోని రాజంపేట నియోజకవర్గం లో భాగంగా ఉంటాయన్నారు. రాజంపేట నియోజకవర్గంలోని 4 మండలాలు కలవడంతో ప్రస్తుతం కడప జిల్లా జనాభా 22 96,497 కు చేరిందన్నారు. అలాగే నందలూరులోని సౌమ్యనాథ ఆలయం, తెలుగు వాగ్గేయకారుడు అన్నమాచార్యుల గ్రామం తాళ్లపాక కడప జిల్లాకు రావడం జరిగిందన్నారు ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. రాజంపేట నియోజకవర్గంలోని మండలాలలోని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వైఎస్ఆర్ జిల్లాలో కలపడం జరిగిందన్నారు. రాజంపేట నియోజకవర్గం లోని 4 మండలాలకు కడప జిల్లాతో విద్యా ఆర్థిక సాంస్కృతిక సంబంధాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ నాలుగు మండలాలలో విద్యాసంస్థలు,ప్రభుత్వ, ఇతర సంస్థలు అన్ని కడప జిల్లాలో పరిధిలో పనిచేస్తాయని తెలిపారు. కడప జిల్లా దేశవ్యాప్తంగా హార్టీ కల్చర్ హబ్ గా అభివృద్ధి చెందుతోందని ఇందుకు రాజంపేటలోని 4 మండలాల్లో పండించే బనానా, చీని, నిమ్మ, మామిడి, బొప్పాయి వంటి పంటలు తోడు కావడంతో కడప జిల్లాకు హార్టికల్చర్ హబ్ గా మారడానికి మరింత ఊతమిస్తుందన్నారు. అలాగే రాజంపేట రెవెన్యూ డివిజన్లో ప్రతిరోజు యధావిధిగా ప్రభుత్వ సేవలు, సుపరిపాలన అందించాలని అధికారులకు సూచించారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన రాజంపేట రెవెన్యూ డివిజన్ కు మౌలిక వసతుల్లో ఎలాంటి ఇబ్బందులు లేవని ఇంకా ఏమైనా కావాల్సి ఉంటే సమకూరుస్తామన్నారు. వైయస్సార్ కడప జిల్లాకు 2025 సంవత్సరం అత్యంత ప్రతిష్టాత్మకమైన సంవత్సరం గా అభివర్ణించారు. దేశవ్యాప్తంగా నీతి అయోగ విడుదల చేసే యాస్పిరేషనల్ డిస్టిక్స్ విభాగంలో అన్ని పారామీటర్లలో ప్రథమ స్థానాన్ని సంపాదించి దేశంలోనే ప్రథమ ర్యాంకును సాధించినందుకు గర్వంగా ఉందని జిల్లా కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. జాతీయస్థాయిలో అత్యున్నత గుర్తింపు రావడం జిల్లాలో అన్ని శాఖల పరంగా శాఖల అధికారులు చేపట్టిన విజయంగా చెప్పవచ్చున్నారు. ఈ విజయానికి సహకరించిన జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ప్రతి ఒక్కరికీ కూడా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. అంతేకాకుండా జిల్లాలో నిర్వహిస్తున్న ప్రజా పరిషత్ సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) విధానాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామని ప్రజల నుండి అందిన ఫిర్యాదులను అత్యంత త్వరితగతన పరిష్కరించేందుకు అన్ని శాఖల విభాగాధిపతులు క్షేత్రస్థాయి వరకు క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే సమస్యలను పరిష్కరించడం అభినందనీమన్నారు. రెవెన్యూ వ్యవస్థలో ఉన్నటువంటి సమస్యలను మరింత సమర్థవంతంగా పరిష్కరించే దిశగా "రెవెన్యూ క్లినిక్" అనే విధానాన్ని కొత్త సంవత్సరంలో వచ్చే సోమవారం నుంచి అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో, అన్ని మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల పరిధిలో అమలు చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని కూడా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో అమలు చేస్తున్న స్మార్ట్ కిచెన్ ప్రోగ్రాం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు జిల్లాలో ప్రతిరోజు 10వేల మందికి పైగా మధ్యాహ్నం భోజన పథకం కింద పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా మరో 33 స్మార్ట్ కిచెన్ ల పనులు వివిధ దశల్లో పురోగతిలో వున్నాయని జనవరి 26 నుంచి అమల్లోకి వస్తే 1.29 లక్షల మందికి విద్యార్థులకు ప్రతిరోజు రుచికరమైన పౌష్టికాహారం అందించే విధంగా లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు ఇందుకు సహకరించిన పత్రికా విలేకరులు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాజంపేటలోని 4 మండలాలకు కూడా స్మార్ట్ కిచెన్ ప్రోగ్రాం పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. పి ఫోర్ లో భాగంగా ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న స్టార్ట్ అప్ కడప సెంటర్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రానున్న మరో మూడు నెలలలో అందుబాటులోకి రానుందని దీని ద్వారా యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఉపాధి అవకాశాలు రావడానికి తోడ్పడుతుందని తెలిపారు. జిల్లాకు తలమానికంగా నిలిచిన గండికోట లో అత్యంత వైభవంగా గండికోట ఉత్సవాలను జనవరి నెలలో 11, 12, 13 తేదిలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి సలహాలు సూచనలు తెలియ. చేయాలని కోరారు. నూతన సంవత్సర వేడుకలను అధికారులందరూ తమ వంతు బాధ్యతగా జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టల్స్, పాఠశాలలలో విద్యార్థులతో జరుపుకోవాలని సూచించారు అలాగే ముఖ్యంగా యువత నూతన సంవత్సర వేడుకలను బాధ్యతాయుతంగా జరుపుకోవాలన్నారు. అనంతరం జిల్లా ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మినిమం టైం స్కేల్ అమలు చెయ్యాలి



వేంపల్లి డిసెంబర్ 31:(ప్రభాత వార్త)

కాంట్రాక్టువల్ టీచింగ్ ఫ్యాకల్టీ ట్రిబుల్ ఐటీ ఫ్యాకల్టీ డైరెక్టర్ కుమార్ స్వామి గుప్తాకు అధికార పూర్వకంగా కలిసి 2026 కాను నూతన కార్యచరణ అనేది చేయాలనుకుంటున్నాము 2018లో జాయిన్ అయినటువంటి గెస్ట్ ఫ్యాకల్టీ 25 వేల రూపాయలు శాలరీతో మబ్బు పెడుతూ గత ఎనిమిది సంవత్సరాల నుంచి 8 పైసలు కూడా పెంచకుండా చాప కింద నీరులా ప్రవర్తిస్తున్నటువంటి అధికారులు మా యందు దయవుంచి 2026కానీ మ రీడిజిగ్నేషన్ చేయాలి అలాగే 2014లో ఉన్నటువంటి ఫ్యాకల్టీకి 54 వేల రూపాయలు ఎలా అయితే ఇస్తున్నారో ఆ శాలరీ అనేది మాకు కూడా అమ్మాలు చేయాలి "సమాన పనికి సమాన వేతనం" ఇవ్వాలంటూ కూర్చున్నాము అలాగే మాకు రావాల్సినటువంటి మినిమం నీడ్స్ ఏవైతే ఉన్నాయో క్వార్టర్స్ కూడా ఇవ్వాలి అంటూ కోరుచున్నాము. ఈ కార్యక్రమం లో కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ అసోసియేషన్ ప్రెసిడెంట్ నజీర్ హుస్సేన్, మణికిరణ్ లోకనాథం, శుభహన్, మాబు సుభాన్దేవిక గిరిజ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## సలహాదారులా! లేక స్వాహా దారులా!

## తులసి రెడ్డి సూటి ప్రశ్న..

వేంపల్లి: డిసెంబర్ 31 (ప్రభాత వార్త)



పన్నుల రూపంలో ప్రజల వద్ద నుండి ముక్కు పిండి వసూలు చేసిన డబ్బును సలహాదారుల పేరుతో ప్రభుత్వం పప్పులు, బెల్లంలా పంచి పెట్టడం ఏ మాత్రం భావ్యం కాదని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సలహాదారుల పేరుతో కొన్ని పదుల మందిని నియమించి ప్రభుత్వ సొమ్మును దుబారా చేస్తోందని మండిపడ్డారు.ప్రభుత్వం నియమించిన సలహాదారులు ఆయా రంగాలలో నిష్ణాతులే కావచ్చు. వారిని గౌరవంగా ఆహ్వానించి, సత్కరించి వారి సలహాలను లిఖిత రూపంలో గానీ మౌఖికంగా గాని తీసుకోవచ్చు అంతే తప్ప సలహాదారుల పేరుతో జీవోలు ఇచ్చి, కార్యాలయాలు ఏర్పాటు చేసి,సిబ్బందిని ఏర్పాటు చేసి, క్యాబినెట్ ర్యాంకు ఇచ్చి ఒక్కొక్క సలహాదారుని మీద నెలకు నాలుగు లక్షల 50 వేల రూపాయలు ల సొమ్మును ఖర్చు చేయడం భావ్యమా అని తులసి రెడ్డి ప్రశ్నించారు.ఉచితంగా సలహాలు ఇచ్చే వారిని సలహాదారులు అంటారు, అంతేతప్ప డబ్బు తీసుకొని సలహాలు ఇచ్చే వారిని స్వాహా దారులు లేదా వ్యాపారస్తులు అంటారు.ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పునరాలోచించి భవిష్యత్తులో సలహాదారులను నియమించవద్దని,ఇప్పటికే నియమించబడిన సలహాదారులను తొలగించాలని, సలహాదారులు కూడా స్వచ్ఛందంగా ఆ పదవుల నుండి తప్పుకొని ప్రభుత్వానికి ఉచితంగా సలహాలు ఇవ్వాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# దళితులకు ఎక్కడా అన్యాయం జరగకూడదు



కడప, డిసెంబర్ 31 ప్రభాతవార్త :

దళితులకు ఎక్కడా అన్యాయం జరగకుండా చూడడమే కాకుండా జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే.. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ లక్ష్యం అని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో.. సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, రాజంపేట సబ్ కలెక్టర్ భావన హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబందించిన కేసులలో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. అలాగే వారికి సంబంధించిన భూ సమస్యలు ఏమైనా ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిస్కరించాలని కమిటీ సభ్యులైన అధికారులను ఆదేశించారు. ఈ కమిటీలో బాధితులకు పరిష్కారం అందించడం ఒక ఎత్తయితే భవిష్యత్తులో అట్రాసిటీ కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ దిశగా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. దళితుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలను కల్పిస్తోందని.. ఎక్కడ వారు అన్యాయానికి గురి కాకుండా ఎస్సి ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రత్యేక పర్యవేక్షణ చేయడం జరుగుతోందన్నారు. సామాజిక రుగ్మతలను దూరం చేసి.. అన్ని వర్గాల ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ చేపడుతున్న చర్యలపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు అన్ని మండలాల్లోని ఆయా ప్రాంతాల్లోని ప్రజప్రతినిధులను సమన్వయం చేసుకుని అట్రాసిటీ కేసులు నమోదు కాకుండా అవగాహన పెంచాలన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ హాస్టళ్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు.. బాల్య వివాహాలను అరికట్టే చర్యల్లో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ డివిజన్ల వారీగా ఆర్డీవోలు, డిఎస్పీలు మండల స్థాయి అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి.. ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలన్నారు. పోలీసు యంత్రాంగం ద్వారా జిల్లాలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. గత సమావేశంలో చర్చించిన విషయాలలో చాలా అంశాలను పరిష్కరించామని, పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై తదుపరి సమావేశం నాటికి పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం గత సమావేశంలో సంబంధిత కేసుల యాక్షన్ టెకెన్ రిపోర్టును అంశాలను.. సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి చదివి వినిపించగా..ఆయా శాఖల నుండి హాజరైన విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులను కలెక్టర్, ఎస్పీలు వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఏఎస్పీ మనోజ్ హెగ్డే, కడప, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు డివిజన్ల ఆర్.డి.ఓ లు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చిన్నయ్య, చంద్రమోహన్, డిఎస్పీలు, ఎస్సి కార్పొరేషన్ ఈడి డీఆర్డీఏ పిడి రాజ్యలక్ష్మి,, పబ్లిక్ ప్రసిక్యూటర్లు, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.







జిల్లాల పునర్విభజన అనంతరం మొదటిసారి రాజంపేట నియోజకవర్గ పర్యటనలో భాగంగా.. బుధవారం నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి దేవాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి. ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అనంతరం శ్రీవారి దర్శనం, ప్రత్యేక అర్చనలు, ఆలయ సత్కారం చేసి జిల్లా కలెక్టర్ కు తీర్థ ప్రసాదాలు ఆలయ ప్రధానార్చకులు. .అనంతరం రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయ పరిశీలనకు వచ్చిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరికి పూల మొక్క అందజేసి స్వాగతం పలికిన రాజంపేట సబ్ కలెక్టర్ భావన. అనంతరం సబ్ కలెక్టర్ కార్యక్రమంలోని సమావేశ మందిరంలో రాజంపేట రెవిన్యూ డివిజన్ పరిధిలోని మండల తహసిల్దార్లతో సమావేశమైన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి. రెవెన్యూ డివిజన్ వ్యాప్తంగా రాజంపేట, నందలూరు, టి.సుండుపల్లె, వీరబల్లి మండలాల్లో రెవెన్యూ, అభివృద్ధి అంశాలపై ఆయా మండల తహశీల్దార్లు, ఎంపీడీవోలను అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్. ఇక మీదట వైఎస్ఆర్ కడప జిల్లాలో భాగంగా రాజంపేట డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో ప్రభుత్వ పాలన కొనసాగుతుందని. జిల్లా యంత్రాంగం చేపట్టే అన్ని పరిపాలనా సంబంధ అంశాలను యధావిధిగా చేపట్టడం జరుగుతుందని తెలిపిన జిల్లా కలెక్టర్. రెవెన్యూ, భూ సమస్యలు, లీగల్ సంబందిత అంశాలను, ప్రభుత్వ ఆస్తులు, ప్రభుత్వ భూముల పరిరక్షణలో మండల తహశీల్దార్లు పారదర్శకంగా, సమర్థవంతంగా వ్యవహరించాలని, అలాగే.. పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదులు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని సూచించారు.



బొమ్మన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏఐఎంఎఫ్ తరపున కేకులు పంపిణీ

## పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ : తహసీల్దార్

వీరాపునాయునిపల్లి డిసెంబర్31 ప్రభాతవార్త :

మండలంలో జనవరి రెండో తేదీ నుంచి 9వ తేదీ వరకు రి సర్వే జరిగిన గ్రామాలలో రైతులకు ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తాసిల్దార్ బి లక్ష్మీదేవి తెలిపారు. 2న తలపనూరు, కీర్తిపల్లె 3న పాయసంపల్ల, లింగాల 6న గోనుమాకుల పల్లె, 7న తంగేడుపల్లె, 8న అంకిరెడ్డిపల్లి, వెల్దుర్తి 9న అయ్యవారిపల్లి,పిల్లి వారి పల్లి గ్రామాలలో గ్రామ రెవెన్యూ అధికారి ద్వారా పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. రైతులు పాసుపుస్తకాలను సకాలంలో తీసుకోవాలన్నారు.

## పదవతరగతి విద్యార్థులకు చిరు బహుమతులు

తొండూరు డిసెంబర్ 31 ప్రభాతవార్త :



కీర్తిశేషులు బుడ్డా వెంగల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా దీనబంధు వికలాంగుల సేవా సమితి అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ రైటింగ్ ప్యాడ్స్ వితరణగా అందజేశాడు. వీటితోపాటు వచ్చే పదవ తరగతి ఫలితాలలో మొదటి ద్వితీయ తృతీయ స్తానాల్లో నిలిచేవారికి పదివేల రూపాయల నగదు బహుమతి ప్రకటించాడు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శివప్రసాద్ పాల్గొని దాతలు అందించిన సహాయాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు జనార్దన్ రెడ్డి వంటి దాతలు చేసిన దాతృత్వం వెలకట్టలేనిదని ఇంకా ఇలాంటి దాతలు ముందుకు వచ్చి పాఠశాలలకు సహాయం చేసి పాఠశాల అభివృద్ధిలో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రీ సర్వే చేసిన పాస్ పుస్తకాలు పంపిణీ

తొండూరు డిసెంబర్ 31 ప్రభాతవార్త :

మండలంలోని సైదాపురం,జాలపర్తి సంబంధించిన పాస్ పుస్తకాలు జనవరి 02 నుంచి రీ సర్వే పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తహసిల్దార్ బి రామచంద్రుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి రెండో,మూడో తేదిలు రెండు రోజులపాటు సైదాపురం గ్రామంలో ప్రాథమిక స్కూల్లో గ్రామసభ నిర్వహించి రీ సర్వే జరిగిన 554 ఈపాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిగిలిన గ్రామాల ఈ సర్వే పనులు పూర్తి కాగానే అవి కూడా రైతులందరికీ పంపిణీ చేస్తామని తెలియజేశారు.

## ఉపాధి హామీ చట్టం నిర్వీర్యం : ఇర్ఫాన్ బాష

ప్రొద్దుటూరు డిసెంబర్ 31 ప్రభాతవార్త



దేశంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తూ గ్రామీణ పేద ప్రజల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తోందని ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ భాష ఆరోపించారు. బుధవారం ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా బడుగు, బలహీన వర్గాలకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు శాపంగా మారాయన్నారు. ఈ పథకం కేవలం సంక్షేమ పథకం కాదని, పని చేయాలనుకునే ప్రతి గ్రామీణ కుటుంబానికి జీవన భృతి కల్పించేందుకు తీసుకువచ్చిన హక్కు ఆధారిత చట్టమన్నారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం భరించే విధంగా మార్చి, రాష్ట్రాలపై భారీ ఆర్థిక భారం మోపుతోందన్నారు. నిధుల కొరత పేరుతో పనులు నిలిపివేయడం, పనిదినాలు తగ్గించడం, వేతనాల చెల్లింపుల్లో జాప్యం చేయడం ద్వారా పేద వర్గాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పేదల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, ఉపాధి హామీ పథకాన్ని పటిష్టం చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## పోలీస్ కార్యాలయంలో సిబ్బంది కొరత

రామసముద్రం డిసెంబర్ 31 ప్రభాతవార్త



పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఈ స్టేషన్ పరిధి కర్ణాటక సరిహద్దులో ఉండటంతో శాంతిభద్రతల నిర్వహణ మరింత సవాలుగా మారింది. అవసరమైన సిబ్బంది లేక పరిమిత పోలీసులతోనే వాహన తనిఖీలు, నైట్ ప్యాట్రోలింగ్, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి పనులు చేపడుతున్నారు. పండుగలు, కార్యక్రమాల సమయంలో అదనపు బందోబస్తు కల్పించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని స్థానికులు, ప్రజలు కోరుతున్నారు.

## జనసేన క్యాలెండర్ ఆవిష్కరణ

రామసముద్రం డిసెంబర్ 31 ప్రభాతవార్త



మండల కేంద్రంలో బుధవారం శ్రీ లక్ష్మీజనార్ధన స్వామి ఆలయ ప్రాంగణంలో జనసేన నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించి నూతన సంవత్సరం జనసేన క్యాలెండర్ ను ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా మండల జనసేన నాయకులు ఎం జి పి వినోద్ మాట్లాడుతూ మదనపల్లి జిల్లా హోదా కల్పించినందుకు సి ఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సి ఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే షాజాహాన్ బాషా కు మండల జనసేన నాయకులు తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్న, మదనపల్లి జిల్లా కేంద్రం కావడంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, పరిశ్రమలు వస్తాయని, ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలు వస్తాయని మదనపల్లి కేంద్రాన్ని ప్రకటించిన కూటమి ప్రభుత్వాన్ని మండల ప్రజలు ఎన్నటికీ మరువరన్నారు.పోలీస్ స్టేషన్, తాహిసీల్దార్ కార్యాలయం, ఎంపిడిఓ కార్యాలయాల్లో జనసేన క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు.ఈ సమావేశం లో పాల్గొన్నా బెస్ట్ బిజినెస్ అవార్డు గ్రహీత ఎం జి పి వినోద్, కళ్యాణ్, ఎస్ వి ఆర్ బాలాజీ, చంద్రహాసన్, సికిందర్, జనసేన సూరీ, చంటి,వినోద్ అనిల్ స్వామి, దొడ్డిపల్లె రామాంజులు, రంగప్ప, చలపతి, అశోక్ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రొద్దుటూరు అర్బన్ డిసెంబర్ 31 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని 33వ వార్డులో ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా పారిశుద్ధ కార్మికులకు వారి ఇంటికి కావలసినటువంటి పండుగ సరుకులను కార్మిక నాయకులు టిఎన్టియుసి కడప పార్లమెంటు అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్,33 వ వార్డు కౌన్సిలర్ గాజుల శివ జ్యోతి బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మాట్లాడుతూ కార్మికులు ఆరోగ్యంగా, ఆనందంగా ఉన్నప్పుడే పట్టణాలు పరిశుభ్రంగా ఉంటాయని, పట్టణాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, కార్మికుల హక్కుల కోసం వారి అవసరాల కోసం ఎప్పుడు మా సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో 33 వార్డ్ టీడీపీ నాయకులు సావిత్రి, హుస్సేన్ సాహెబ్,ఖాదర్ వలీ, నీలాపురం,దావూద్,జహీర్ తేజ,అలీ మహబూబ్ హుస్సేన్ పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.



## రీ సర్వేపై అవగాహన సదస్సు

నిమ్మనపల్లె, డిసెంబర్ 31 ప్రభాతవార్త :

మండలంలో పంచాయితీ కేంద్రమైన ముష్టూరులో బుధవారం రీ సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి తహశీల్దార్ తపస్విని, ఆర్ఐ రమేష్, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పట్ల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి

రైల్వేకోడూరు డిసెంబర్ 31 ప్రభాతవార్త::



నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల అధికారులు ప్రజా సమస్యల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ అన్నారు. రైల్వే కోడూరు నియోజకవర్గాన్ని మొదటిసారిగా జిల్లా కలెక్టర్ రావడం అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరును తిరుపతిలో చేర్చడం పరిపాలన విభాగం కొత్త సంవత్సరంతో మొదలు పెడుతున్నామని అందుకు అధికారులందరూ సమాయుక్తంగా ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో నడిపించాలని అర్జీదారులను చులకనగా చూడకుండా వచ్చిన సమస్యలను వేదవంతంగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. నూతనంగా రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని తిరుపతిలో చేర్చడం అందులో బుధవారం రైల్వే కోడూరుకు వచ్చిన కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వ కార్యాలయాల పేర్లను వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. పరిపాలన విభాగం కొత్త సంవత్సరంలో ప్రవేశ పెడుతున్నామని అందుకు ప్రతి ఒక్క అధికారి అప్రమిత్తంగా వ్యవహరించి అధికారులందరూ అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే కోడూరు ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ అరవ శ్రీధర్, టిడిపి నాయకులు ముక్కా రూపానందరెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు టిడిపి యువ నాయకులు పంతగాని నరసింహ ప్రసాద్ తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్ తాసిల్దార్ అమర్నాథ్ పెనగలూరు ఎమ్మార్వో అమరేశ్వరితో పాటు ఓబులవారిపల్లి చిట్వేలి పుల్లంపేట తదితర ప్రాంతాలకు చెందిన తాసిల్దార్ లో ఎండిఓలో పాటు ఆర్ఐ లక్ష్మీదేవి తాతంశెట్టి నాగేంద్ర నార్జాల హేమరాజ్ నవీన్ పటాన్ మోలా తులసి పంచాయతీరాజ్ డిఇ బాల నరసింహులు ఎంఈఓ సుందర్ బాబు వెలుగు ఏపిఎం మల్లికార్జున రాజు, వసుంధర తదితరులు కలెక్టర్‌కు స్వాగతం పలికారు.

## ఓం నామస్మరణతో హిందూ సమ్మేళన ఏర్పాట్లు

రామసముద్రం డిసెంబర్ 31ప్రభాతవార్త



మండల కేంద్రంలో జనవరి 4 న జరగనున్న హిందూ సమ్మేళనానికి భారీ ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం హిందూ సమ్మేళన కమిటీ సభ్యులు కాషాయపు జెండాలపై ఓం ఆకారంలోని అక్షరాలను ప్రత్యేకంగా దిద్దుతూ ఆధ్యాత్మిక శోభను సంతరించుతున్నారు. సమ్మేలనం విజయవంతం కోసం నిర్వాహకులు ఏర్పాట్లను వేగ వంతం చేసి బస్టాండ్ కూడలిలో కాషాయపు తోరణాలు కట్టి అక్కడక్కడా ప్లెక్సీ లు కట్టారు వీటిని ఆసక్తిగా తిలకిస్తున్నారు.

## 97 శాతం పింఛన్ల పంపిణీ

కురబలకోట డిసెంబర్ 31 ప్రభాతవార్త



మండలంలో బుధవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 97 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో గంగయ్య తెలిపారు. కూటమి ప్రభుత్వం జనవరి నెలలకు సంబంధించి ముందస్తుగా వృద్ధులకు, దివ్యాంగులకు పంపిణీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. బుధవారం మండలంలో కన్నా నివారిపల్లిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా డిఆర్డిఏ పిడి .నాగేశ్వరరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు దివ్యాంగులకు ఈ పింఛన్లు ఎంతో ఆసరాగా నిలిచాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగయ్య, తాసిల్దార్ ధనుంజయులు, ఐసిడిఎస్ సిడిపిఓ, డిప్యూటీఎంపీడీవో అశ్విని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## డిజిటల్ ట్విన్ మెడిసిన్ పై అవగాహన

కురబలకోట డిసెంబర్ 31 ప్రభాతవార్త



మండలం అంగళ్ళుకు సమీపంలోని మీట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగం వారుమీట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్ అండ్ టెలి కమ్యూనికేషన్ ఇంజనీర్ వారి ఆధ్వర్యంలో డిజిటల్ ట్విన్ మెడిసిన్ మరియు ఆటోనమస్ డ్రైవింగ్ సిస్టమ్స్ అనే అంశంపై ముఖ్యఅతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలూరుకి చెందిన వివిటి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి విజయేంద్ర బాబు మాట్లాడుతూ డిజిటల్ మెడిసిన్ ప్రాముఖ్యత వివరిస్తూ రోగి శరీరానికి డిజిటల్ రూపాన్ని రూపొందించడం ద్వారా నిర్ధారణ చికిత్స ప్రణాళిక నిరంతర మానిటరింగ్ చేయవచ్చునని తెలిపారు. డ్రైవింగ్ సిస్టంపై మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారంగా సెన్సార్లు మ్యాప్స్ ఆర్డర్ కెమెరాలు అల్ట్రాసౌండ్ ద్వారా డ్రైవర్ లేకుండానే వాహనాల నావిగేట్ చేయగలవని క్రూజ్ కంట్రోల్ మార్చి ఆటోమేషన్ స్టీరింగ్ కంట్రోల్ డ్రైవర్ అలర్ట్ వంటి సదుపాయాలు ప్రమాదాలను గణనీయంగా తగ్గిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి .రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ ఎస్ రాజశేఖర్, ఐఈటి ఈ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్ శరవణ కుమార్, కోఆర్డినేటర్స్ ఆ రివర్స్, ప్రశాంత్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే

మదనపల్లె, డిసెంబర్ 31 ప్రభాతవార్త :



పెన్షనులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతి ఇంటిలో సంక్షేమం వెల్లివిరుస్తొందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. 14వ వార్డులో స్థానిక టిడిపి నాయకులు, ఆర్టీసి 1, 2వ డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు నాగూర్‌వలి(షోఆప్‌శీనా) ఆధ్వర్యంలో లబ్దిదారులకు పెన్షన్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే హాజరై పెన్షన్లను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్దే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. నాగూర్‌వలి మాట్లాడుతూ లబ్దిదారులకు ఒక్కరోజు ముందుగానే పెన్షన్ అందడంతో వారి కుటుంబాలలో నూతన సంవత్సరం ఆనందం కనిపిస్తొందన్నారు. జిల్లా ఏర్పాటులో ఎమ్మెల్యే పాత్ర ఎంతో ఉందని ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు టిడిపి నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

లక్కిరెడ్డిపల్లి డిసెంబర్ 31 ప్రభాతవార్త



ఎస్సీ ఎస్టీ వర్గాలు చట్టాలపై అవగాహన పెంపొందించుకొని ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా అభివృద్ధి చెందాలని తాసిల్దార్ క్రాంతికుమార్ ఎంపీడీవో రెడ్డయ్య ఎస్సై శోభలు పేర్కొన్నారు. బుధవారం బిఏ నాగిరెడ్డిపల్లి ఎస్టీ కాలనీలో సర్పంచ్ చెంచర్లపల్లి రెడ్డయ్య అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఎస్సీ ఎస్టీ జిల్లా నిఘా కమిటీ సభ్యులు రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకొని అభివృద్ధిలోకి రావాలన్నారు. పలు సమస్యలు అక్కడ ఉన్న అధికారులకు వారు తెలియజేశారు. వారు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంచర్లపల్లి రెడ్డయ్య కోనంపేట సర్పంచ్ లక్ష్మీనారాయణ గ్రామ రెవెన్యూ అధికారి భార్గవ్ పంచాయతీ కార్యదర్శి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## పాము కాటుకు గురైన తండ్రి కుమారుడు

### తండ్రి మృతి, కొడుకు పరిస్థితి విషమం

మదనపల్లెక్రైమ్, డిసెంబర్ 31 ప్రభాతవార్త.

మదనపల్లె మండలం లో బుధవారం విషాదకర సంఘటన వెలుగు చూసింది. చౌడేపల్లి మండలం, బోయకొండ సమీపంలోని యానాదిపాళెం కు చెందిన నరసింహులు (56), సాలమ్మ దంపతులు మదనపల్లి మండలం చీకలబైలు పంచాయతీ మేడిపల్లి వద్ద ఉన్న నిసార్ అహ్మద్ కు చెందిన మామిడి తోటలో 40ఏళ్లుగా కాపలాగా ఉంటూ ఆ తోటలోనే నివాసముంటున్నారు. వీరికి నలుగురు పిల్లలు ఉన్నారు. కాగా తండ్రి నరసింహులు, కుమారుడు రాజు లు మంగళవారం తోటకు ఆనుకుని ఉన్న వంకలోకి చేపల వేటకు వెళ్లారు. అక్కడ ఉన్న ఓ పాము తండ్రి కొడుకులను కాటేసింది. ఇద్దరు మేడిపల్లికి చెందిన ఓ వ్యక్తి వద్ద మంతరించు కున్నారు. అయితే బుధవారం ఉదయం తండ్రి కొడుకులు తీవ్ర అస్వస్థతకు గురియ్యారు. వెంటనే ఇద్దరిని కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించే లోపే నరసింహులు మృతి చెందాడు. అతని కుమారుడు రాజు పరిస్థితి విషమంగా మారింది. మరణవార్త తెలియగానే కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపించారు. తాలూకా పోలీసులు విచారిస్తున్నారు.

## మండలంలో ఘనంగా పింఛన్ల పంపిణీ

చిన్నమండెం, డిసెంబర్ 31, ప్రభాతవార్త :



మండలంలోని ప్రతి గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో ఉత్సాహంగా సాగింది. టీడీపీ మండల అధ్యక్షులు మూగి రెడ్డెప్ప ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, వారి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ సొమ్మును నాయకులు అందజేశారు. మండల అధ్యక్షుడు మూగి రెడ్డెప్పతో పాటు చిన్నమండెంలో అక్రమ్ ఖాన్ పాల్గొన్నారు. అలాగే ఆయా గ్రామాల టీడీపీ అధ్యక్షులు, గ్రామ కమిటీ సభ్యులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్యాలెండర్ మరియు డైరీ ఆవిష్కరణ

పీలేరు డిసెంబర్ 31 ప్రభాతవార్త:



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం క్యాలెండర్ మరియు డైరీని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి వారి క్యాంపు ఆఫీస్ నందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి ప్రధానోపాధ్యాయులు దిశా నిర్దేశకులని, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని తెలియజేశారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్నటువంటి అన్ని సౌకర్యాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తర్వాత రాష్ట్ర కౌన్సిలర్ తాటిపర్తి గంగాధర్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు సక్రమంగా ప్రభుత్వ అందిస్తున్నటువంటి అన్ని సౌకర్యాలను కల్పించడంలోనూ మరియు చక్కని విద్యా బోధన జరగడంలోను తమ సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఆర్థిక కార్యదర్శి వై.వి.రమణ పీలేరు డివిజన్ అధ్యక్షులు సురేంద్ర, ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్‌రెడ్డి, రెడ్డప్పలు పాల్గొన్నారు.

## పండగ వాతావరణంలో పించను పంపిణీ

పీలేరు డిసెంబర్ 31 ప్రభాతవార్త:



పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం ఒకరోజు ముందుగానే పంపిణీ చేయడం, లబ్ధిదారుల కళ్ళల్లో అంతులేని ఆనందం చూడటం, వారి ఆశలు ఆకాంక్షలు నెరవేర్చడమే కూటమి పార్టీ ప్రధాన లక్ష్యమని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఉదయం ఆరు గంటల నుండి సంబంధిత అధికారులు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం మన రాష్ట్రంలో అమలు చేయడం, వృద్ధులు, వితంతువులను ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షులు నల్లారి చంద్రకుమార్ రెడ్డి, కలికిరి మాజీ సర్పంచ్ నల్లారి లక్ష్మీకర్ రెడ్డి, కూటమి నాయకులు, అనుబంధ సంఘాలు, మహిళలు, అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

మైదుకూరు, డిసెంబర్ 31, ప్రభాతవార్త:




మైదుకూరు పట్టణంలోని ఎస్టి గురుకుల పాఠశాల నందు భారత విద్యార్థి ఫెడరేషన్ 56వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా నాయకులు ఎద్దు రాహుల్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు అజయ్, లోకేష్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రం ప్రాంతంలో 1970 సంవత్సరంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించిందన్నారు. రాష్ట్రంలో జిల్లాలో ముఖ్యంగా మైదుకూరు నియోజకవర్గంలో విద్యార్థుల సమస్యల కోసం ఎల్లప్పుడూ ఎస్ఎఫ్ఐ పోరాడుతుంది, కాబట్టి 56వ ఎస్ఎఫ్ఐ 56 వ ఆవిర్భావ దినోత్సవం గురుకుల పాఠశాలలో నిర్వహించడం జరిగింది.

## కూరగాయల మార్కెట్‌ను సందర్శించిన ఎస్ఐ

గాలివీడు, డిసెంబర్ 31(ప్రభాతవార్త):



పట్టణంలోని కూరగాయల మార్కెట్‌ను బుధవారం గాలివీడు ఎస్ఐ నరసింహారెడ్డి తన సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ పరిసరాలను పరిశీలించి అక్కడి కూరగాయల వ్యాపారులు, మార్కెట్ ఫీజు వసూలుదారులతో సమావేశమైపలు భద్రతా అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దొంగతనాల నివారించేందుకు మార్కెట్ ప్రాంగణం కీలకపాత్రాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా దొంగతనాలను అరికట్టవచ్చని అభిప్రాయపడ్డారు. శాంతిబద్రతలకు విఘాతం కలిగించేలా యువత వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## హుండీని పగులగొట్టి చోరీ

గాలివీడు, డిసెంబర్ 31(ప్రభాతవార్త):



మండలంలోని నూలివీడు పంచాయతీ బోడసానివాండ్లపల్లెలోని రామాలయంలో మంగళవారం రాత్రి దొంగలు హుండీని ఎత్తుకెళ్లి పగులకొట్టిన ఘటన చోటు చేసుకుంది. ఇటీవల 4 నెలల క్రితమే నూతనంగా నిర్మించిన ఈ రామాలయానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనానికి వచ్చేవారు. ఈ క్రమంలో హుండీలో భక్తులు భారీగా కానుకలు వేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయాన్ని గమనించిన దొంగలు ఎవరూ లేని రార్త్రఇ సమయంలో దేవాలయం నుంచి హుండీని తీసుకెళ్లి సమీపంలోని పొలంలో పగలకొట్టి అందులోని నగదు తీసుకువెళ్లినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పగలకొట్టిన హుండీని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## ఆపస్ క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ

కేవీ పల్లె డిసెంబర్ 31 ప్రభాతవార్త:



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

స్థానిక మండల వనరుల కేంద్రం (ఎం ఆర్ సి)నందు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘానికి సంబంధించిన నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్లను మరియు డైరీలను జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పచ్చార్ల సుధాకర్ మండల విద్యాశాఖ అధికారులు పి రెడ్డి భాషా గారు సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. మండల అధ్యక్షులు రావూరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయులకు ఏ సమస్య వచ్చిన పరిష్కారం చూపడంలో మా సంఘం ముందుంటుందన్నారు. మండల ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వచ్చే 2026వ నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని కోరారు. పచ్చార్ల సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న మూడు డిఏలను మంజూరు చేయాలని, పిఆర్సి కమిటీని వేసి నివేదిక వచ్చేలోపు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు వీడి వెంకటేశ్వర్లు, ఆర్థిక కార్యదర్శి హరి, ఉపాధ్యాయులు నరేష్, పుష్ప,సులోచన, కవిత, అన్సర్ భాష పాల్గొన్నారు.

## కెజిబివి పాఠశాలకు 10 వేలు వితరణ

రామసముద్రం డిసెంబర్ 31ప్రభాతవార్త



మండలంలోని కెజిబివి పాఠశాలకు మండల కేంద్రానికి చెందిన రమేష్ శెట్టి పది వేల రూపాయలు వితరణ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమార్తె పుట్టినరోజు కానుకగా పతి ఏడాది నిరు పేదలకు గాని, వృద్దులకు గాని, అనాధ శరణాలయాలకు గాని, పాఠశాలలో పేద విద్యార్థులకు గాని తమ వంతు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలకు ఆర్థిక సాయం వితరణ ఇచ్చినందుకు పాఠశాల ప్రిన్సిపాల్ మస్తాన్ బీ కృతజ్ఞతలు తెలిపారు.

## టిడిపిలో చేరిన 30 మంది వైసిపి నేతలు

రామసముద్రం డిసెంబర్ 31 ప్రభాతవార్త

రామసముద్రం మండలం మూగవాడి పంచాయతి ఎర్రపల్లెకు చెందిన 30 మంది వైసిపి నేతలు ఎమ్మెల్యే షాజహాన్ భాషా సమక్షంలో బుదవారం టిడిపిలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎర్రప్పల్లె వైసిపి నేతలు లింగారెడ్డి,రామకృష్ణారెడ్డి ఆధ్యర్యంలో బుదవారం ఏర్రపల్లెలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ప్రజారంజక పాలన మెచ్చి వైసిపి నేతలు టిడిపిలో చేరినట్లు తెలిపారు.పార్టీలో చేరిన వీరికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని, పార్టీలో సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్యే హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్, మాజీ అధ్యక్షుడు కృష్ణం రాజు, మాజీ సర్పంచులు తిప్పన్న,పెద్ది రెడ్డి, శివారెడ్డి, రూపేష్ రెడ్డి మాజీ జెడ్పీటీసీ శివశంకర్, ఏ పి మోడల్ స్కూల్ చైర్మన్ బాలాజీ, మాలమహానాడు అధ్యక్షుడు కృష్ణప్ప, నాయకులు గుండలపల్లె, అమరప్ప, హేమంత్, వేణు గోపాల్, స్థానికం రాజేష్, కాంట్రాక్టర్ మహేష్ రెడ్డి ,డాక్టర్ శివకుమార్ రెడ్డి ,లోకేష్,విశ్వనాథ్,నరేపల్లె శీనప్ప,నడింపల్లి రమేష్ అధికసంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీ కోసం పాటుపడిన వారికి ప్రశంసా పత్రాలు

బద్వేలు, డిసెంబర్ 31, ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తూ పార్టీ చేపట్టే పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళ్తూ పార్టీ అభివృద్ధికి పాటుపడుతున్న వారికి బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ప్రశంసా పత్రాలు అందించారు. మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన ఉత్తమ కార్యకర్తలను గుర్తించి ప్రశంసా పత్రాలు అందజేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె 2025 సంవత్సరంలో కూటమి ప్రభుత్వం సాధించిన కీలక విజయాలను మీడియాకు వివరించారు. కొత్త జిల్లాల ఏర్పాటు తదితర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వెంగళరెడ్డి ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాద్ రెడ్డి, ప్రశంసా పత్రాలు పొందిన వారిలో రాగి మాను ప్రతాప్ కుమార్, షేక్ మహబూబ్ బాషా, నాగభూషణం, ప్రశాంత్, తుడిమెల్ల సుదర్శన్, మస్తాన్ బాబు, జహంగీర్ భాష,ఎస్ఎం బాషా తదితరులు ఉన్నారు.

## మదనపల్లి జిల్లా కేంద్రం తంబళ్లపల్లెకు ఓ వరం

తంబళ్లపల్లె డిసెంబర్ 31 ప్రభాతవార్త ః



మదనపల్లె (అన్నమయ్య ) జిల్లా కేంద్రం ఏర్పాటుతో తంబళ్లపల్లె నియోజకవర్గం అన్ని రంగాలుగా అభివృద్ధి చెందడం ఖాయమని స్థానిక ప్రజలకు ఓ వరమని రాష్ట్ర అధికార ప్రతినిధి పర్వీన్ తాజ్, జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు సురేంద్ర యాదవ్,రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీదర్ నాయుడు, మండల అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్రలు కొనియాడారు. బుధవారం ఎన్టీఆర్ ఘాట్ లో మదనపల్లె జిల్లా ఏర్పాటుపై రాష్ట్ర నాయకుల చిత్రపటాల ముందు కృతజ్ఞతలు తెలియజేస్తూ భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్,ప్రధాని నరేంద్ర మోడీ కి జయ జయ ద్వానాలు పలికారు. కూటమి ప్రభుత్వం వర్ధిల్లాలి నినాదాలతో మూడు పార్టీల నాయకులు కార్యకర్తలు హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఫించన్ల పంపిణీలో జిల్లాలో నిమ్మనపల్లె ఫస్ట్

నిమ్మనపల్లె, డిసెంబర్ 31 ప్రభాతవార్త :



అన్నమయ్య జిల్లాలో డిసెంబర్ నెల ఎన్టిఆర్ బరోసా ఫించన్లు ఒక్కరోజు మందుగానే పంపణీ జరిగాయని ఎంపిడిఓ పక్రుద్దిన్ సాహెబ్ బుధవారం తెలిపారు. మండలంలో 5014మందికి గానూ 4749మంది పంపిణీ చేయడం జరిగిదన్నారు. మండలంలో ఎన్టిఆర్ భరోసా కింద పింఛన్ల పంపిణీలో 95శాతం పించన్లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఓ డి.పక్రుద్దిన్‌సాహెబ్ తెలిపారు. ఈ సందర్బంగా ఎంపిడిఓ మాట్లాడుతూ మొదటి తారీఖున కంటే ముందుగానే బుధవారం ఒక్కరోజే మద్యాహ్నం 12గంటలకు 95శాతం పించన్లు పంపిణీ చేసి జిల్లాలో మొదటిస్థానం పొందామన్నారు. ఈ పంపిణీలో ఏఓ రమేష్, గ్రామ గ్రామాన పంపిణీ చేసిన గ్రామ కార్యదర్శులకు సచివాలయ సిబ్బందికి ఎంపిడిఓ కృతజ్ఞతలు తెలిపారు.

## బీసీల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలి

రాయచోటి టౌన్ డిసెంబర్ 31 ప్రభాతవార్త



బీసీల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని తమ యొక్క అభివృద్ధికి బీసీలంతా ఏకతాటికైతే బీసీలను ఎవరు విడదీయలేరని బీసీ నాయకుడు కోటగుంట్ల రవిశంకర్ అన్నారు. బుధవారం పింఛని పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆయన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల సైతం ఉన్నటువంటి బీసీలు అందరూ ఒక తాటిపై ఉన్నట్లయితే ఏమీ చేయలేరని ఇది ప్రతి ఒక్క బీసీ గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయనతోపాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

